పురుషునికున్న అధికారాన్ని కంఠంలో ప్రతిధ్వనింపచేస్తూ. "మధ్యాహ్నం పాలవాడు రాలేదు" అని నిర్లక్ష్యంగా వంటింటిలోంచి సమాధానం అందింది. తెలుగు భాషలో చాలా పుస్తకాలు చదువుకొన్నాడు గోపాలం. ఎలాంటి పరిస్థితులలోనైనా మాట క్రిందబడనివ్వని స్నేహితులతో గోపాలానికి సంవత్సరాల తరబడి పరిచయం ఉంది. ఈ విజ్ఞానాన్నంతనీ చర్విత చర్వణం చేసుకున్నా "పాలవాడు రాలేద"న్న సమాధానానికి తిరుగు ప్రశ్న వేయడానికి సామగ్రి దొరికింది కాదు. గోపాలం కర్ణకుహరాల్లో "కాఫీ కాఫీ" అని ప్రతిధ్వనిస్తోంది.

సంవత్సరాలకొలదీ అలవాటు పడిన వ్యసన వాంఛకు "పోనిద్దూ యీవాళ్ళకు" అని సమాధానం చెప్పుకోగల నిగ్రహ శక్తి గోపాలానికి ఎలా కలుగుతుంది? అందుకని జేబు తడిమి చూచుకొన్నాడు. లక్ష్మి ప్రసన్నం కాలేదు. డ్రాయరు తాళం తీసి చూశాడు. అక్కడా ఆమె జాడలేమీ కనుపించలేదు. పెట్టె తెరచి జేబురుమాలు వద్దనుండి కూడా అన్నీ దులిపి చూశాడు. ఎక్కడా మ్రోగలేదు. రెండు పాత దస్తావేజులు మాత్రం పెట్టె అడుగున కనిపించినై. పదిరూపాయల మొహారు తేజస్సుగా కనుపిస్తోంది దస్తావేజు మీద. అయితేనేం హోటల్లో కాఫీ కొనగల విలువ వాటిలో లేదు ఏం లాభం? గోపాలం బ్రహ్మచారిగా ఉన్నప్పుడు అతను ఎందరు అందగత్తెలను చూడలేదు? అయితే అందరూ అతన్ని వరించారా? మళ్ళీ యీ గత జీవితచరిత్ర జ్ఞప్తికొచ్చి గోపాలం పెట్టెతాళం వేసి లేచి నిలుచున్నాడు. ఎదురుగా భార్య పెట్టె కనబడుతూంది. అందులో కొద్దో గొప్పో డబ్బుండక పోదు. అయినా ఆ పెట్టె తెరవడానికి తనకు హక్కెక్కడిది? నెల జీతం తెచ్చి భార్య చేతిలో పోస్తే ఆమె పెట్టెలో పోస్తుంది. సంసార కృత్యాలు అవసరాన్ని బట్టి హెచ్చు తగ్గులుగా ఆ జీతం రాళ్ళను కరగదీస్తాయి. గోపాలం కాఫీ త్రాగడం కూడా సంసార కృత్యాల జాబితాలో జేరినా నెలాఖరురోజుల్లో అందులోనూ భార్య సుముఖంగా లేని కాలంలో యీ కాఫీకి ముఖ్యత్వం సన్నగిల్లి పోతుంది. గోపాలం వెళ్ళి మెల్లిగా కుర్చీలో జారబడ్డాడు.

పాప కూనిరాగాలు తీసుకుంటూ గదిలో ప్రవేశించింది. ఏమీ తోచక కొంతసేపలా గదంతా తిరిగింది. తుదకు వచ్చి టేబిలు మీద ముందుకు వాలి నిలుచుంది. పాపకు వీధిలో దొరికిన ఆటవస్తువు జేబులో ఉన్న మూలాన్ని టేబిలుమీద వాలి నిలుచుండగా వత్తింది. వెంటనే పాప దాన్ని బయటకు తీసి పట్టుకొంది. గోపాలం ఏదో ఆలోచనలో ఉన్నట్లు గమనించి చెయ్యి తాకి కదుపుతూ "నాన్నా, దీని పేరేమిటి?" అంది తన చేతిలో ఆటవస్తువు నుద్దేశించి. గోపాలం ఆటవస్తువు వంక చూశాడు. హృదయం తేలిక బరచుకొని, తాత్కాలికంగా కష్టాలను మరుగుకు నెట్టి పాప బాల్య చేష్టలలో పాలుగొనాలని చిరునవ్వు ముఖాన్ని పులుము కొన్నాడు. పాప చేతిలో ఉన్న ఆట వస్తువును చేతబట్టుకొని "దీని పేరేనా? గుర్రం!" అన్నాడు. పాప గట్టిగా నవ్వింది. "అవును తల్లీ అది గుర్రమే!" అన్నాడు గోపాలం మళ్లా.

ఈసారి పాప పకపకా నవ్వింది. మధ్య మధ్య చేతులు అడ్డుంచి కూడా నవ్వింది. గోపాలం మాట్లాడలేదు. "గుర్రమైతే కాళ్ళూ, చెవులూ, తోకలూ యివన్నీ ఏవీ?" అంది పాప కొంచెం విమర్శనా జ్ఞానంతో. "చదరంగంలో గుర్రానికి అవన్నీ వుండవు" అన్నాడు గోపాలం. అది వినిపించుకోకుండానే పాప వంటింటిలో అమ్మదగ్గరకు పరుగెత్తింది. అమ్మను గట్టిగా రెండుసార్లు పిలిచింది. పని తొందరలో ఉండి ఆమె జవాబు యివ్వలేదు. పాప అమ్మముందుకు పోయి చేతిలో వస్తువును చూపుతూ "నాన్న దీన్ని గుఱ్ఱమంటున్నాడే" అంది. సమయం చిక్కించుకొని గోపాలం భార్య "మనం కాదన్నదాన్ని ఆయన అవునంటారు. మనం అవునన్నదాన్ని ఆయన కాదంటారు" అంది. ఈ మాటకు అర్థం తెలియకపోయినా తన వైపున మాట్లాడినట్లు చేతల్లో తెలుసుకొని పాప ఆడుకుందుకు వెళ్ళిపోయింది.

గోపాలం విద్యార్థిగా వున్న కాలంలో ఒకామె విద్యార్థినిగా ఉండేది. అప్పట్లో గోపాలానికీ ఆమెకూ మంచి స్నేహంగా వుండేది. స్కూలు ఫైనలు పాసైన తరువాత ఆమె

